జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## విద్యార్థులకు దిక్సూచి పుస్తకాల పంపిణీ

**జలుమూరు, అక్టోబర్ 16(వార్త):** పదో తరగతి విద్యార్థులు భౌతికశాస్త్రంలో మరిన్ని మెళకువలు తెలుసుకునేలా దిక్సూచి పుస్తకాన్ని భౌతికశాస్త్రం ఫోరం రూపొందించిందని అచ్యుతాపురం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం కొత్తకోట దుర్గా భవాని తెలిపారు. ఆ పాఠశాల విద్యార్థులకు బుధవారం ఈ పుస్తకాలను అంద జేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భౌతికశాస్త్రంలో వచ్చిన మార్పులను క్షుణ్ణంగా తెలుసుకునేందుకు ఈ పుస్తకాలు ఉపయోగపడ తాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

**- ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు**




**సీతంపేట, అక్టోబర్ 16(వార్త):** పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం ఆయన సీతంపేట మండలంలోని పెద్దపొల్ల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. విద్యార్థుల కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేసి సాధారణ వైద్య పరీక్షలు చేయాలని సూచించారు. భోజన మెనూ పరిశీలించారు. మెనూ ప్రకారమే భోజనం పెట్టాలని ఆదేశించారు. భోజనం రుచికరంగా ఉండాలని సూచించారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. తరగతి గదులను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

# చేపల పెంపకంతో మత్స్యకారులకు స్వయం ఉపాధి



**మందస, అక్టోబర్ 16(వార్త):** చేపల పెంపకంతో మత్స్యకారులకు స్వయం ఉపాధి లభిస్తుందని మత్స్యశాఖాభివృద్ధి అధికారి ధర్మరాజుపాత్రో అన్నారు. బుధవారం ఆయన మందస ప్రాంతంలో పలు చెరువుల్లో ఫింగర్లింగ్ చేపలను విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపలు సక్రమంగా పెంచాలన్నారు. స్వదేశీ మత్స్యకార సహకార సంఘాలకు పీఎంఎంఎస్వై పథకం కింద ప్రభుత్వం ఫిష్ సీడ్, ఫార్మ్ (ఇచ్ఛాపురం) నుంచి చేప పిల్లలను అందజేస్తుందన్నారు. మందస, పలాస మండలాల్లో ఈ సంఘాలకు చేప పిల్లలను అందజేసి, చెరువుల్లో విడిచిపెడతామన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మత్స్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఫిష్ ఫారం నుంచి చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తామని తెలిపారు. మందసలో 5800, పలాసలో 29700 చేపల పిల్లలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అధికారులు కె.నాగరాజు, జ్యోత్స్న, సాగరమిత్రలు కిరణ్, రాంబాబు, రాజీవ్, స్వదేశీయ మత్స్య పారిశ్రామిక, సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కంటి శస్త్ర చికిత్సలకు 30మంది ఎంపిక

**కొత్తూరు, అక్టోబర్ 16(వార్త):** కొత్తూరులోని వేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో రాగోలు జెమ్స్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత నేత్ర చికిత్స శిబిరం నిర్వహించారు.

ఈ శిబిరంలో కొత్తూరు, భామిని, ఒడిస్సా చుట్టుపక్కల గ్రామ ప్రజలు సుమారుగా 30 మంది ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపికయ్యారు.

వీరికి రాగోలు జెమ్స్ ఆసుపత్రిలో ఆపరేషన్లు ఉచితంగా చేయడంతో పాటు ఉచితంగా మందులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

కార్యక్రమం లో కంటి వైద్య నిపుణులు ఇప్పిలి జాన కిరామయ్య, జెమ్స్ ఆసుపత్రి పీఆర్వోలు దుర్గాప్రసాద్, అర్జున్ పాల్గొన్నారు.





## పలాస ఆర్డీవో సుదర్శనదొరకు తీవ్ర అస్వస్థత

**పలాస, అక్టోబర్ 16(వార్త):** పలాస ఆర్డీవో సుదర్శనదొర బుధవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం ఆయన తన ఛాంబర్‌లోనే ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. దీంతో ఆయనను రెవెన్యూ సిబ్బంది హుటాహుటిన పలాసలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖలోని మెడికవర్ హాస్పిటల్‌కు తరలించారు.

## ఎన్బీసీ కాలువలో గుర్రపు డెక్క తొలగింపు



**జలుమూరు, అక్టోబర్ 16(వార్త):** చిన్నదూగాం వద్ద ఉన్న వంశధార మెయిన్ ఎన్బీసీ కాలువ వద్ద సాగునీటిని విడిచిపెట్టే షట్టర్లు వద్ద గుర్రపు డెక్క పెరగడంతో సాగునీరు నిలిచిపోయింది. ఈ సమాచారం అందుకున్న వంశధార లస్కర్లు బుధవారం ఉదయం అక్కడికి చేరుకుని గుర్రపు డెక్కను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలువలో ఉన్న గుర్రపు డెక్కను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## తాగునీటి కొళాయిల్లో మురుగునీరు



**జలుమూరు, అక్టోబర్ 16(వార్త):** నరసన్నపేటలో బుధవారం ఉదయం తాగునీటి కొళాయిల ద్వారా మురుగు నీరు వచ్చిందని స్థానికులు వాపోయారు. తాగడానికి నీరు లేని సమయంలో ఇలా మురుగు నీరు రావడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్వచ్ఛమైన తాగునీటిని విడుదల చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## చదువుపై ఆసక్తి పెరిగేలా బోధించండి

**జలుమూరు, అక్టోబర్ 16(వార్త):** విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెరిగేలా బోధించాలని ఎంఈవో బమ్మిడి మాధవరావు ఉపాధ్యాయులకు సూచించారు. నగరికటకం ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక విద్యార్థులకు ఎలా పాఠాలు బోధిస్తున్నారో తెలుసుకున్నారు. ఆయన వెంట హెచ్ఎం తిరుపతిరావు ఉన్నారు.



## డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన

**జలుమూరు, అక్టోబర్ 16(వార్త):** నరసన్నపేట మండలం చోడవరం పంచాయతీలో మురుగు కాలువల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని టీడీపీ బూత్ లెవెల్ ఆర్గనైజర్ అడపా రజినీకాంత్ తెలిపారు. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా ఈ పనులను ప్రారంభించామన్నారు. త్వరలోనే ఈ పనులను సంక్రాంతిలోగా పూర్తి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పంగ శ్రీరాములు పాల్గొన్నారు.





## గోరువాని చెరువులో నీరు తొలగింపు

**జలుమూరు, అక్టోబర్ 16(వార్త):** నరసన్నపేటలోని సంతతోట వద్ద ఉన్న గోరువాని చెరువులో నీరు పూర్తిగా పాడైంది. దీంతో స్థానిక పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. ఈ మేరకు బుధవారం నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టామని సర్పంచ్ బూరెల్లి శంకరరావు, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, ఈవో ద్రాక్షాయిని తెలిపారు. ఈ నీటిని తొలగించిన వెంటనే కొత్త నీటిని అందించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని వారు స్పష్టం చేశారు.

## ఎంఆర్సీని సందర్శించిన జీసీడీవో



**జలుమూరు, అక్టోబర్ 16(వార్త):** నరసన్నపేట మండలంలోని మండల విద్యా వనరుల కేంద్రాన్ని బుధవారం సమగ్ర శిక్ష జీసీడీవో నీరజ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలల్లో వీరగాథకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రాసెస్‌ను పూర్తి చేయాలని తెలిపారు. కేజీబీవీలో నాన్ టీచింగ్ పోస్టులకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి యువ శాంతారావు, ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీరు వృధా



**జలుమూరు, అక్టోబర్ 16(వార్త):** నరసన్నపేటలోని సిద్ధాశ్రమం వీధిలో పంచాయతీ తాగునీటి కొళాయి ద్వారా నీరు కొన్ని రోజులుగా వృధాగా పోతుందని స్థానికులు వాపోతున్నారు. వీటికి టాప్ లేకపోవడంతో అడ్డుగా కర్రలు పెట్టినప్పటికీ తాగునీరు వృధాగా పోతుందని స్థానికులు తెలిపారు. ప్లాస్టిక్ ట్యాప్‌లు వేయడంతో కుక్కలు కొరికేస్తున్నాయని, ఐరన్ ట్యాప్‌లు వేయాలని పంచాయతీ అధికారులను వారు కోరారు.

## 'మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు'

**జలుమూరు, అక్టోబర్ 16(వార్త):** వరి సాగులో మోతాదుకు మించి ఎరువులు వాడకాన్ని నిరోధించాలని వ్యవసాయ శాఖ అధికారి సునీత తెలిపారు. బుధవారం ఆమె నరసన్నపేట మండలం తామరపల్లి రైతు సేవ కేంద్రంలో రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెగుళ్ల నివారణకు తగు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.




# మైనార్టీ వార్డులపై చిన్నచూపేల?

■ నిధులు కేటాయించకపోవడంపై ఇఛ్ఛాపురం 8వ వార్డు కౌన్సిలర్ మధుమూర్తి ఆగ్రహం ■ మున్సిపల్ సమావేశంలో బైఠాయింపు
■ అధికారులతో వాగ్వాదం ■ నిధుల కేటాయింపునకు అంగీకారంతో శాంతించిన వైనం



**ఇఛ్ఛాపురం, అక్టోబర్ 16(వార్త):** ఇఛ్ఛాపురం మున్సిపాలిటీలో 15వ ఆర్థిక సంఘం నిధులను తమకు కేటాయించకపోవడంపై ఎనిమిదో వార్డు కౌన్సిలర్ పల్లంటి మధుమూర్తి అధికారులను నిలదీశారు. వీరి తీరుకు నిరసనగా కౌన్సిల్ హాల్‌లో బైఠాయించారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగింది. వివిధ వార్డులకు రూ.48 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులను కేటాయింపుపై అజెండాను ఆమోదించేందుకు చర్చ ప్రారంభించారు. ఈ సందర్భంగా మధుమూర్తి తన వార్డుకు నిధులు కేటాయించకపోవడంపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. తమ వార్డు ప్రజలు కూడా పన్నులు కడుతున్నారని, అత్యధికంగా మైనార్టీలు ఉన్నారని, కానీ నిర్లక్ష్యం చేయడం ఏమిటని ప్రశ్నించారు. కౌన్సిల్ హాల్లో నేలపై బైఠాయించారు. పూర్తిగా ధ్వంసమైన మంగళవారం పేట రహదారి నిర్మాణానికి నిధులు అడుగుతున్నా, పట్టించుకోకపోవడమేంటని నిలదీశారు. ఇష్టారీతిన నిధులు కేటాయించడం తగదన్నారు. మంగళవారం పేట రహదారి నిర్మాణానికి రూ.10లక్షలు కేటాయించాలని, లేకుంటే కౌన్సిల్ హాల్ నుంచి కదిలేది లేదని భీష్మించారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తానని హెచ్చరించారు. దీంతో రెండో విడతలో నిధులు కేటాయిస్తామని అధికారులు, మున్సిపల్ చైర్పర్సన్ హామీ ఇవ్వడంతో ఆయన శాంతించారు.

ఐదో వార్డు కౌన్సిలర్ నారాయణబెహరా కూడా తన వార్డుకు నిధులు కేటాయించలేదని బైఠాయించారు. సమావేశంలో కౌన్సిలర్లు ప్రదీప్ సామ్యూల్, గేదెల శేఖర్ తదితరులు వివిధ సమస్యలను ప్రస్తావించారు. సమావేశంలో కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంతో అభివృద్ధి సాధ్యం




**వజ్రపుకొత్తూరు, అక్టోబర్ 16 (వార్త):** కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు మోహనరావు, గోవిందపురం పీహెచ్‌సీ మాజీ చైర్మన్ పుచ్చ ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ గోరకల వసంత్ స్వామి అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఉద్దానం గోపీనాథపురం పంచాయతీ పరిధిలో గల ఉద్దానం మెళియాపుట్టి గ్రామంలో రూ.11.65 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డుకు బుధవారం వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లోని కుటుంబాలకు ఏడాదిలో కనీసం వంద రోజుల వేతనం, మెరుగైన జీవనోపాధి కల్పనకు కృషి చేస్తామన్నారు. ఈ వారోత్సవాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసిందని చెప్పారు. గత ప్రభుత్వ పాలనలో గ్రామీణ ప్రాంతాలు కనీసం మౌలిక సదుపాయాలకు నోచుకోక అధ్వానంగా తయారయ్యాయన్నారు. పరిస్థితిని చేరుకుందైన అన్నారు పల్లెలకు పూర్వ వైభవం తెచ్చేందుకే పల్లె పండగ పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు మదనాల జోగారావు, ఉమామహేశ్వరరావు, బచ్చల అప్పారావు, నారాయణస్వామి, నెయ్యలసూర్యనారాయణ, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక ఉచితమంటూ టెండర్లు పిలవడమేంటి?

**-వైసీపీ నేత చిరంజీవి నాగ్**



విలేఖరులతో మాట్లాడుతున్న వైసీపీ నేత చిరంజీవి నాగ్

**ఆమదాలవలస,అక్టోబర్ 16(వార్త):** కూటమి అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక విధానం తీసుకొస్తామని చెప్పిన నాయకులు.. అధికారం చేపట్టాక టెండర్లు విధానం ప్రకటించడం ఏమిటని వైసీపీ నేత చిరంజీవి నాగ్ ప్రశ్నించారు. బుధవారం ఆయన తన నివాసంలో విలేఖరులతో మాట్లాడారు. మేనిఫెస్టోతో పాటు ఎన్నికల ప్రచారంలో ఉచిత ఇసుక విధానం తెస్తామని ప్రజలకు హామీ ఇచ్చి, నేడు సామాన్య ప్రజలకు ఇసుక అందుబాటులో లేకుండా చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వం అమలు చేసిన ధరలకంటే ఎక్కువ ధరలకు తీసుకుని అమ్ముతున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు గడుస్తున్నా ఇసుక విధానం ప్రకటించకపోవడంలో ఆంతర్యం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. రెండు నదుల మధ్యలో ఉన్న ఆమదాలవలస నియోజకవర్గంలో తోటాడ, దూసి, దూసిపేట, దిబ్బలపేట, కొత్తవలస, నిమ్మతొర్లాడ నారాయణపురం ప్రాంతాల్లోని 12 ర్యాంపుల్లో అనధికారికంగా ఎమ్మెల్యే అండదండలతో అక్రమ ఇసుక రవాణా జరుగుతోందని ఆరోపించారు. రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే పరిస్థితిలో లేరని మండిపడ్డారు అధికారులు చూసీ చూడనట్టుగా వ్యవహరించడం సరికాదన్నారు.

అనధికారికంగా నిర్వహిస్తున్న ఈ రాంపుల్లో ఒడిశా బిల్లులతో విచ్చలవిడిగా అక్రమ ఇసుక దందా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. మద్యం టెండర్లుకు పది రోజులు గడువు ఇచ్చి, 108 ఇసుక ర్యాంపులకు ఆన్‌లైన్ దరఖాస్తుకు రెండు రోజులు కాల పరిమితి ఇవ్వడమేమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు ఈ దందాపై స్పందించాలని కోరారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## కత్తిరివానిపేట పాఠశాలను సందర్శించిన ఎంఈవో

**జలుమూరు, అక్టోబర్ 16(వార్త):** జలుమూరు మండలం కత్తిరివానిపేట గ్రామంలోని ఎంపీపీ పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి మాధవరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ చదువు బాగా చెబుతున్నారా..లేదా అని ఆరా తీశారు. నాణ్యమైన, సుచికరమైన వేడివేడి ఆహార పదార్థాలను పెడుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ చదువు బాగా చెప్పాలని, రుచికరమైన ఆహార పదార్థాలు పెట్టాలని ఆదేశించారు. ఆయన వెంట హెచ్ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.



# ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

**ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ**



**మందస, అక్టోబర్ 16(వార్త):** ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రామికునిగా పనిచేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ అన్నారు. మందస మండలంలోని బేతాళపురం, బహడపల్లి, నారాయణపురం, హరిపురం, జీ.ఆర్.పురం, కేజీబీవీ, మందస, కొత్తపల్లి, సొండిపూడి, బైరిసారంగపురం పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించి ఉపాధ్యాయ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 117 జీవో రద్దు, కామన్ సర్వీస్ రూల్స్ అమలు, నూతన పీఆర్సీని అమలు చేయాలన్నారు. మధ్యంతర భృతి ప్రకటన, కేజీబీవీ టీచర్లుకి మినిమం టైం స్కేల్ అమలు, పదో తరగతి విద్యార్థుల పరీక్షల మాధ్యమం, ప్రస్తుత విద్యాసంవత్సరం సిలబస్‌లోని అసంగతాలు, ఉపాధ్యాయ పెండింగ్ బకాయిలుపై సంబంధిత ఉన్నతాధికారులకు ఇప్పటికే నివేదించానన్నారు. భవిష్యత్‌లో ఉపాధ్యాయుల ప్రతీ సమస్యకు పరిష్కారం చూపే దిశగా పనిచేస్తానన్నారు. రాబోయే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మొదటి ప్రాధాన్యతా ఓటుతో గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మందస ప్రధాన కార్యదర్శి కర్రి సుందరరావు, సీనియర్ నాయకులు కె.పాపారావు, వి.వి.వరప్రసాద్, జిల్లా కౌన్సిలర్లు బి.తిరుపతిరావు, డి.చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు డి.రామారావు, బి.మురళి తదితరులు పాల్గొన్నారు.




# చేప పిల్లలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే అశోక్



**ఇచ్ఛాపురం, అక్టోబర్ 16(వార్త):** ఇచ్ఛాపురం ప్రభుత్వ చేపపిల్లల పెంపక కేంద్రం నుంచి కవిటి, సోంపేట పలాస, ఇచ్ఛాపురం, మందస మండలాల పరిధిలోని స్వదేశీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు ఎమ్మెల్యే బెందాళం అశోక్ బుధవారం చేప పిల్లలను పంపిణీ చేశారు. ఇచ్ఛాపురంనకు 28600, కవిటి 4200, సోంపేట 73500, పలాస 29700, మందస 5800 కలిపి 1,41,800చేప పిల్లలను అందజేశారు. కార్యక్రమంలో మత్స్య శాఖ అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దలక్ష్మీపురంలో జనసేన జెండా ఆవిష్కరణ

**ఇచ్ఛాపురం, అక్టోబర్ 16(వార్త):** ఇచ్ఛాపురం మండలం బూర్జపాడు పంచాయతీ పెద్ద లక్ష్మీపురం గ్రామంలో జన సైనికుల సహాయంతో పులకల తులసీరావు ఆధ్వర్యంలో జనసేన జెండాను నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు దాసరి రాజు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోధన రెడ్డి బుధవారం జనసేన జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు రాష్ట్ర మత్స్యకార శాఖ కార్యదర్శి నాగుల హరి బెహరా, కర్రి నాగరాజు, జానీ, రొక్కల భాస్కర్ జోగారావు, వల్లభ, శేఖర్, పరశురామ్, యోగి, మధు, తారకేష్, పాపారావు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.





## ‘భోజన పథకంలో మెనూ అమలు చేయండి’

**జలుమూరు, అక్టోబర్ 16(వార్త):** ప్రభుత్వ ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజన పథకంలో మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారాన్ని అందించాలని ఎంఈవో ఉప్పాడ శాంతారావు ఆదేశించారు. బుధవారం ఆయన నరసన్నపేట మండలం కరగాం పంచాయతీ నర్సింగపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకంలో అందిస్తున్న ఆహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. తప్పనిసరిగా తాజా ఆహారాన్ని మాత్రమే విద్యార్థులకు అందించాలని ఆయన ఆదేశించారు.

## గోపాలపెంట ఇసుక ర్యాంపు తనిఖీ



**జలుమూరు, అక్టోబర్ 16(వార్త):** నరసన్నపేట మండలం గోపాలపెంట పంచాయతీ వంశధార నదీపరివాహక ప్రాంతంలో ఉన్న ఇసుక ర్యాంపును శ్రీకాకుళం ఆర్డీవో సాయిప్రత్యూష పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టర్ ఇక్కడకు రావాల్సి ఉందని.. కొన్ని అనివార్య కారణాలతో ఆయన పర్యటన రద్దయిందని చెప్పారు. ఇసుక ర్యాంపుల నిర్వహణపై దృష్టి సారిస్తామన్నారు.

## పల్లె పండుగతో గ్రామ స్వరాజ్యం



**ఇచ్ఛాపురం, అక్టోబర్ 16(వార్త):** గాంధీజీ కలగన్న గ్రామ స్వరాజ్యం సాధనకే పల్లె పండుగ నిర్వహిస్తున్నామని మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు అన్నారు. అరకపద్ర, టి.బరంపురం గ్రామ పంచాయతీలో సీపీ రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అరకపద్రలో రూ.30 లక్షలు, టి.బరంపురం పంచాయతీలో రూ.33 లక్షలతో సీసీ రోడ్లు చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, రంగాల పద్మావతి, ఆర్.ధర్మారావు, ఎస్.సహదేవు, డి.కామేశ్వరరావు, ఎల్.పద్మనాభం, పి.బాబ్జీ, రామమూర్తి, పి.చంద్రశేఖర, ప్రకాష్‌చంద్రనాయక్, పంచానన బెహరా, మంగి బాబూరావు, మురళీ లెంక, ఆర్.పుణ్యవాసులు, ఎంపీడీవో కె.రామారావు, శ్రీనివాసరావు, ఇతర శాఖల అధికారులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎల్ఐసీ ప్రీమియం భారం తగ్గించండి

**ఇచ్ఛాపురం, అక్టోబర్ 16(వార్త):** ఎల్ఐసీ పాలసీల పై ప్రజలకు ప్రీమియం భారం తగ్గించాలని ఏజెంట్‌అసోసియేషన్ అధ్యక్షుడు రాజేంద్రనాయుడు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన ఇచ్ఛాపురం శాటిలైట్ ఆఫీసు బ్రాంచ్ మేనేజర్ మూర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బుజ్జి, సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.




Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413